



# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 135 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

27-03-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4


# ఎన్నికలెప్పుడైనా గెలుపు ఎవరిది?

- తెరపైకి నియోజకవర్గాల పునర్విభజన అంశం
- డిలిమిటేషన్‌తో రాజకీయ సమీకరణాల్లో మార్పులు
- అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 225కు పెరిగే సూచనలు
- లోక్‌సభ స్థానాల పెంపుపై జోరుగా చర్చలు
- శ్రీకాకుళంలో కొత్త నియోజకవర్గాల ఏర్పాటుకు అవకాశం
- గ్రామాల పునర్విభజన కీలకం - కొత్త సరిహద్దులు సిద్ధం
- కొత్త నాయకులకు అవకాశం - పాత సమీకరణాలకు సవాలు
- ప్రజా ప్రతినిధుల పింఛన్లపై మరో వివాదం

(నవతరం ప్రతినిధి -శ్రీకాకుళం)

శ్రీకాకుళం, మార్చి 26: ఎన్నికలెప్పుడైనా గెలుపు తమదేనని రాజకీయ నాయకులు చెప్పడం సర్వసాధారణం. అధికారంలో ఉన్నవారు తాము మంచి పనులు చేశామని చెప్పుకుంటే, ప్రతిపక్షం వాటిని ఖండించడం కూడా సాధారణమే. అయితే గెలుపు-ఓటములు కేవలం మాటలతో కాకుండా వ్యూహాలు, స్థానిక పరిస్థితులు, అంతర్గత రాజకీయాలపై ఆధారపడి ఉంటాయి. ఇలాంటి సమయంలో రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసే నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) అంశం మళ్లీ హాట్‌టాపిక్‌గా మారింది. జనాభా పెరుగుదల, పరిపాలనా అవసరాల దృష్ట్యా అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల పెంపు జరిగే అవకాశాలపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ స్థానాలు భవిష్యత్తులో 225 వరకు పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో లోక్‌సభ స్థానాలు కూడా 25 నుంచి 38 వరకు పెరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. జిల్లాల వారీగా పరిశీలిస్తే, శ్రీకాకుళం జిల్లాలో కూడా ఈ మార్పుల ప్రభావం తప్పనిసరిగా కనిపించే అవకాశముంది. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాల సంఖ్యలో పెరుగుదల ఉండొచ్చని అంచనా. ముఖ్యంగా జనాభా ప్రాతిపదికన ఒకటి లేదా రెండు కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

డిలిమిటేషన్ ప్రక్రియలో గ్రామాల పునర్విభజన, కొత్త సరిహద్దుల నిర్ణయం కీలకంగా మారనుంది. పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు చేరువైన పాలన లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టనున్నట్లు సమాచారం.

రాజకీయంగా చూస్తే ఈ మార్పులు భారీ ప్రభావం చూపే అవకాశముంది. కొత్త నియోజకవర్గాల రూపకల్పనతో కొత్త నాయకులకు అవకాశాలు లభించే అవకాశం ఉండగా, పాత సమీకరణలు పూర్తిగా మారిపోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అయితే నియోజకవర్గాల పెంపుపై వార్తలు ప్రచారం జరుగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే వరకు స్పష్టత లేదనే చెప్పాలి. ప్రతినిధుల సంఖ్య పెరిగినా ప్రజా సమస్యల పరిష్కారం మెరుగవుతుందా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఇక మరోవైపు ప్రజా ప్రతినిధుల పింఛన్ల అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. కొందరు నాయకులు రెండేసి, మూడేసి పింఛన్లు పొందుతున్నారన్న ఆరోపణలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఉద్యోగులు 30 ఏళ్ల సేవ చేసినప్పటికీ పాత పింఛన్ విధానం అమలు కాకపోవడంతో, ప్రజా ప్రతినిధుల పింఛన్లపై పరిమితులు విధించాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

# షిర్డీసాయి బాబా మందిరంలో మంత్రి అచ్చెన్న పేరిట ప్రత్యేక పూజలు



నవతరం-శ్రీకాకుళం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదినం సందర్భంగా నగరంలోని విశాఖ బీ కాలనీలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రి పేరిట ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అచ్చెన్నాయుడు కృషిచేస్తున్నారని, భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించి మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అనంతరం నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు.

జిల్లాలో ఎక్కడా లేని విధంగా ప్రతి గురువారం ఇక్కడ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నదాన పథకానికి దాతలు మరింతమంది ముందుకు రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మందిర కమిటీ చైర్మన్ డా.మధుకర్ విలేకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కొంక్యాన మురళీధర్, మందిర కమిటీ కోశాధికారి ఇప్పిలి భవానీ, టీడీపీ నాయకులు పీస రమణమూర్తి, న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, జిల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్యసాయి, వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, సెక్రటరీ శివప్రసాద్, ఆలయ ప్రధానార్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు, నారాయణసేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణలో పౌర భాగస్వామ్యం అవసరం

- గ్రామ స్థాయి నుంచే చట్టాలపై అవగాహన కల్పించాలి
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు

నవతరం-శ్రీకాకుళం

చిన్నారుల హక్కుల రక్షణ, పౌరుల సాధికారత క్షేత్రస్థాయి నుంచే మొదలుకావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు ఆకాంక్షించారు. గురువారం స్థానిక కార్యాలయంలో 'బాలల స్నేహపూర్వక న్యాయ సేవలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అట్టడుగున ఉన్న పౌరులకు సైతం చట్టపరమైన హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని హరిబాబు ఆదేశించారు. ఎవరికైనా పథకాలు అందకపోయినా లేదా తిరస్కరించబడినా, వెంటనే సంబంధిత శాఖలతో సంప్రదించి వారికి న్యాయం




చేకూర్చాలని సూచించారు. ముఖ్యంగా బాలలకు 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' పై అవగాహన కల్పించాలని కోరారు. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఆధార్, సదరం వంటి అవసరమైన పత్రాలను పొందేందుకు బాధితులకు తగిన సహాయం అందించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో డీసీపీఓ కె.వి. రమణ, సమగ్ర శిక్షా ప్రతినిధి కె. రామకృష్ణ, వైద్యులు వాసుదేవరావు, రామదాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం

స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

2లో



ఎడిటోరియల్

# రూ'పాయే'!

ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలవిలలాడుతున్నది. మునుపె న్నడూ లేని విధంగా పాతాళానికి దిగజారుతున్నది. మరీ ముఖ్యంగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రూపాయి విలువ రోజురోజుకూ పడిపోతూనే ఉంది. రూపాయి విలువ పెంచుతానంటూ ప్రధాని చెబుతున్న మాటలు ఉత్తికోతలే అని స్పష్టమవుతూనే ఉంది. డాలర్‌తో పోలిస్తే నేడు మన రూపాయి విలువ 94.10కి చేరుకుంది. చరిత్రలో తొలిసారిగా డాలర్ విలువ భారీగా పెరిగి మన రూపాయిని వెక్కిరిస్తోంది. రూపాయి పతనం అనేది కేవలం కరెన్సీ మార్పు మాత్రమే కాదు, ఇది ఆర్థిక వ్యవస్థపై పడుతున్న తీవ్రమైన ఒత్తిడికి ఓ సంకేతం. అందుకే భవిష్యత్తులో రూపాయి ఏ స్థాయికి పడిపోతుందో అనే అందోళన అందరిలో మొదలయింది.

ప్రస్తుత ఆర్థిక ఏడాదిలోనే రూపాయి విలువ ఇప్పటివరకు దాదాపు పదిశాతం మేర క్షీణించింది. 2014 తర్వాత రూపాయికి ఇదే అత్యంత దారుణమైన పతనం. ఆ ఏడాది 9.4 శాతం పడిపోగా, ఇప్పుడు ఆ రికార్డును కూడా దాటేసింది. నిజం మాట్లాడుకోవాలంటే గడిచిన పద్నాలు గేండ్లలో కేవలం రెండు సార్లు మాత్రమే రూపాయి పుంజుకుంది, మిగిలిన అన్ని ఏండ్లలో పతనాన్నే చవిచూసింది.

రూపాయి అంటే కేవలం ఓ నాణెం మాత్రమే కాదు. దేశంలోని కోట్లాది మంది జీవితం. దాని విలువ పైసా పడిపోయినా పేదల జీవితాలు తలకిందులై పోతాయి. ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. కానీ, సామాన్యుల సమస్యలేవీ మన పాలకులకు పట్టవు. సామ్రాజ్య వాదులకు వత్తాసు పలకడం, కార్పొరేట్లకు సలామ్‌లు కొట్టడం తప్ప రూపాయి విలువ కాపాడేందుకు మోడీ చేస్తున్న ప్రయత్నం శూన్యం. దానికి తాజా పరిస్థితులే ఉదాహరణ.

ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహ రణతో మన రూపాయి విలువ రికార్డు స్థాయిలో పడిపోయింది. దీనికి తోడు క్రూడాయిల్ ధరలు పెరగడం మరింత ఆందోళనకరంగా మారింది. ప్రపంచ మార్కెట్‌లో డాలర్ జోరు, దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ రూపాయిని కోలుకోలేని దెబ్బతీశాయి.

అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొంది. సూటిగా చెప్పాలంటే ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచి రూపాయి సుమారు 3.4 శాతం నష్టపో యింది. ఈ కారణంగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐఎస్) భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. ఇది మన ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన నష్టం. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఏకంగా రూ.1,07,077 కోట్లు వెనక్కి వెళ్లిపోయాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మన దేశానికి దాదాపు ఎనభై శాతం చమురు విదేశాల నుంచే వస్తుంది. ఈ నెలలోనే క్రూడాయిల్ ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. దీనితో పాటు రూపాయి బలహీనపడటం వల్ల ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉంది. రూపాయి విలువ పడిపోవడమంటే విదేశాల నుంచి మనం కొనుగోలు చేసే వస్తువుల ధరలు పెరగడమే. మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పెట్రోల్, గ్యాస్‌తో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులకు ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది. పెట్రోల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. దీని ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. అంతేకాదు ముడి సరుకుల ధరలు పెరగడం వల్ల దేశీయ కంపెనీలపై కూడా ప్రతికూల ప్రభావం పడటం ఖాయం.

రూపాయి పతనంతో ముడిచమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మరోవైపు రూపాయిని ఆదుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయత్నాలు చేస్తానంటోంది. కానీ ఆచరణలో మాత్రం చర్యలు శూన్యం. దీనికి తోడు అంతర్జాతీయ పరిణామాలు అనుకూలించక పోవడంతో రూపాయిపై ఒత్తిడి మరింత పెరిగింది. మొత్తానికి అగ్రరాజ్య ఆమెరికా అహంకారానికి మన రూపాయి కొవ్వొత్తిలా కరిగిపోతోంది. మన "నాయకుడు' మాత్రం యుద్ధ విన్యాసాలను చూస్తూ, అమెరికాకు గులాంగిరి చేస్తూ కాలం గడుపుతున్నాడు.

యుద్ధం ఎక్కడ జరిగినా దాని ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉంటుంది. దాని పర్యావసానాలు అనుభవించేది సామాన్యులే. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. ఆ యుద్ధ ప్రభావమే నేడు మన రూపాయిపై కూడా పడింది. పతనానికి కారణమయింది. నేడు ఇంట్లో వండుకునేందుకు కూడా గ్యాస్ దొరక్క చాలామంది గ్యాస్ కంపెనీల వద్ద క్యూలు కడుతు న్నారు. చిరు వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల వారైతే దుకాణాలు మూసేసుకుని అల్లాడుతున్నారు. దీనంతటికి కారణం ముమ్మాటికీ అమెరికా దురహంకారమే. దానికి వత్తాసు పలుకుతున్న మన కేంద్ర పాలకుల నిర్వాకమే.

# 300 తాబేలు పిల్లలను సముద్ర గర్భంలోకి చేరవేత



**నవతరం టెక్కలి**

భావనపాడు సముద్ర తీరం వద్ద భావనపాడు తాబేలు సంరక్షణ కేంద్రం నుండి సుమారుగా 300 తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టడం జరిగినది అని స్థానిక సర్పంచ్ బుడ్డ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన రెడ్డితో పాటు అడ్ల రాజేష్, బత్తిని పకీరు, మరియు సంరక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**నవతరం-మందస**

ప్రజారోగ్యానికి స్వచ్ఛతే కీలకమని పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. స్వచ్ఛ సంకల్పమే ధ్యేయంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని స్వచ్ఛాంధ్ర వాహనాన్ని ఆమె ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల పరిశుభ్రతే రాష్ట్రాభివృద్ధికి పునాదియని తెలియజేస్తూ, ప్రతి గ్రామం పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ సాధ్యమని ఆమె పేర్కొన్నారు. గ్రామ స్వచ్ఛత-మనందరి బాధ్యతని, ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన గ్రామాల నిర్మాణం అనే నినాదంతో ముందుకు వెళ్లాలని కోరారు. అదేవిధంగా స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా హరిపురం, బుడార్సింగి సచివాలయాలకు సంబంధించిన స్వచ్ఛ రథాలను కూడా ప్రారంభించారు. అన్ని సంపదల్లో ఆరోగ్యమే పెద్ద సంపదని, ప్రతి కుటుంబానికి ఆరోగ్యాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో వైద్య సౌకర్యాలను మెరుగుపరచడమే కాకుండా ప్రజల్లో ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

# మొరాయించిన ఆన్లైన్ సేవలు ఆగిపోయిన క్రయ విక్రయాలు

**నవతరం -టెక్కలి**



నేడు స్థానిక టెక్కలి మండల కేంద్రంలో టెక్కలి సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం లో ఆన్లైన్ సేవలకు అంతరాయం కలిగి నందున క్రయ, విక్రయాలు. రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురై బాధపడ్డారు. మొరాయించిన ఆన్లైన్ సేవలు కొరకు వచ్చిన ప్రజలు పని పూర్తి చేసుకుని వెళ్ళుటకు వారు నిరీక్షణ నిట్టూర్పులతో ఎదురుచూపులు చూస్తూ ఉన్నారు.

# జగతికి ఆదర్శం... జానకి రాముల కల్యాణం





శ్రీ సీతారామ కళ్యాణం లోక జీవన హేతుకం. సకల దోష నివారణ. సర్వసంపదలకు నిలయం. ధన ,ధాన్యం, శోభితలై సకల జన సంరక్షణ కి శ్రీరామనవమి ద్వారా రాముని సేవ సకల భక్తజన లోక సంరక్షణమే పరమార్థం అందుకే ఈ పండుగ సకల జనులకు సంతోషాన్ని ఆనందాన్నిస్తుంది.

ఈ మాసంలోని మొదటి పక్షమైన శుక్ల పక్ష నవమినాడు శ్రీరామనవమి జరుపుకుంటున్నాం.

ధర్మ సంస్థాపనార్థం త్రేతాయుగమున శ్రీరామచంద్రమూర్తి అవతరించాడు. లోకమున శాంతిభద్రతలు అందించే నిమిత్తం రామతత్వం ఆవిర్భవించింది. శ్రీరామచంద్రమూర్తి ఆదర్శమూర్తి, ఆరాధ్యమూర్తి. పరమాత్ముడైన శ్రీమన్నారాయణుడు మానవాదర్శాల ధర్మమూర్తిగా అవతరించాడు. ఉపాసనామూర్తిగా కొలిచిన వారికి కొంగు బంగారమై ఏలుకొంటున్నాడు. సమగ్ర ఐశ్వర్యం,ధర్మం, కీర్తి ,సంపద, జ్ఞానం ,వైరాగ్యం ,ఈ ఆరు గుణాలు సమన్వితమైన రూపం ధరించిన వాడే శ్రీరామచంద్రమూర్తి. చైత్ర శుద్ధ నవమి సీతారామ కల్యాణ మహోత్సవం.ఆకాశం ఓ పెద్ద చలువపందిరి అవు తుంది. భూలోకమంతా కళ్యాణమండపంలా. వెలిగిపోతుంది. సిగ్గుల మొగ్గ సీతమ్మ మెదలో.. సకలగుణాభిరాముడు శ్రీరాముడు మూడుముళ్లూ వేస్తాడు.

మంగళవాద్యాలు మిన్నంటుతాయి. అక్షింతలు ముత్తెపు చినుకు లవుతాయి 'రామో రామో రామ ఇతి ప్రజానామభవన్ కథాః ' ఎవరి నోట విన్నా రామారామా అంటూ రామకథా గానమే. అందులోనూ తెలుగువారికి సీతా రాములంటే జననీజనకులంత భక్తి గౌరవమూ 'సీతమ్మ మాయమ్మ, రామయ్య 'మా అయ్య" అని పాడుకోగలిగినంత దగ్గరి తనమూ, 'ఎవడబ్బ సొమ్మని కులుకుతూ తిరిగేవు రామచంద్రా' అంటూ నిందాస్తుతి వినిపించేంత చనువూ! రామనవమి నాటికి, భద్రగిరి మరో అయోధ్యాపురిగా మారిపోతుంది. ఎక్కడెక్కడి భక్తజనమో తరలివస్తారు.అయినా... ఎప్పటి రాముడు? త్రేతాయుగం నాటి పాలకుడు। ఏనాటి మనువువాల్మీకి వర్ణనల ప్రకారం లెక్కించినా కనీసం లక్ష సంవత్సరాలు. అయితే నేం, ఇప్పటికీ రామకథ చెప్పుకుంటాం. పాడుకుంటాం, పరవశంగా నెమరేసుకుంటాం !

రాముడంటే పైపైకి కనిపించే ఆజాను బాహుడో, అరవింద దళాయతాక్షుడో మాత్రమే కాదు - నిలువెత్తు ధర్మస్వరూపం. 'రామాయణం' అంటే రాముడు నడిచిన దారి. రాముడి ప్రతి అడుగూ దర్మం వైపే, రాముడి ప్రతి మాటా ధర్మశాస్త్రాల సారమే. అందుకే పెద్దలు... కష్టాలు వచ్చినప్పుడు రాముణ్ని తలుచుకోమంటారు తలుచుకోగానే,ఏ హనుమద్వాహనం మీదో వచ్చి రక్షిస్తాడని కాదు. ఆయన నడిచిన మార్గం గుర్తొస్తుందని, ఆ బాటలోనే మనమూ ధైర్యంగా వెళ్తామని...,

అత్యాశే అయినా, రాముడిలాంటి నాయకుడి కోసం ఎదురుచూస్తాం అసాధ్యమని తెలిసినా, ఏదో ఓరోజు రామరాజ్యం వస్తుందని ఆశిస్తాం. ఆయనో ఆదర్శ నాయకుడు, ఆదో ఆదర్శవంతమైన పాలన. రాముడి వ్యక్తిత్వాన్ని, వాల్మీకి మహర్షి వేనోళ్ల కొనియాడాడు. 'శుచీ, వికీ, అరిందముడు అని కీర్తించాడు. శుచీ అంటే.. శరీరానికీ మనసుకూ ఎలాంటి కళంకమూ లేనివాడు, వశీ అంటే ఇంద్రియాల్ని వశంలో ఉంచుకున్నవాడు. అరిందముడంటే మనసులోని శత్రువుల్ని సునాయాసంగా గెలిచినవాడు ఏ నాయకుడి కైనా ఉండితీరాల్సిన ప్రాథమిక లక్షణాలివి. మనో దౌర్బల్యాల కారణంగానే ఎంతోమంది నాయకులు సర్వ నాశనమైపోయారు రాజకీయంగానూ వ్యక్తిగతంగానూ.

నాయకుడికి వ్యక్తిత్వ సంపద ఒక్కటే సరిపోదు. జ్ఞాన సంపదా ఉండాలి. ఆ జ్ఞానం అధ్యయనం ద్వారా వస్తుంది. రాముడు గొప్ప చదువరి. వాల్మీకి అతన్ని వేదవేదాంగ తత్వజ్ఞుడని కొనియాడాడు. ఎన్ని విద్యలు నేర్చినా ఏం లాభం, నీతీ నియమం లేకపోతే? రాముడు నియమశీలి, కాబట్టే 'నీతిమాన్' అని మెచ్చుకున్నాడు, స్థిరచిత్తస్య' అని కూడా కీర్తించాడు. రామరావణ యుద్ధం జరుగు తున్నప్పుడు ... ఇంద్రజిత్తు మాయలతో విసిగిపోయిన లక్ష్మణుడు నేను బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తా... రాక్షసులందర్నీ సంహరిస్తా' అంటూ కోపంతో ఊగిపోతాడు. రాముడు తమ్ముడిని చల్లబరుస్తూ 'ఒకానొక వ్యక్తిని చంపడం కోసం భూమ్మీదున్న రాక్షసులందర్నీ నిర్మూలించడం మంచిది కాదు. వాస్తవానికి పోరాడనివాణ్ని చంపకూడదు. ఇంద్రజిత్తు ' సంగతి నాకు వదిలెయ్' అంటాడు. ఓవైపు యుద్ధం జరుగుతోంది. శత్రువు విజృంభిస్తు న్నాడు. ఆసమయంలోనూ నమ్ముకున్న విలువలకు కట్టుబడటం మామూలు విషయం కాదు. 'రమంతే అస్మిన్ ఇతి రామ:' రాముడంటే ఆనందాన్ని ఇచ్చేవాడు. భర్తగా సీతకు ఆనందాన్నిచ్చాడు. కొడుకుగా దశరథు డికి ఆనందాన్నిచ్చాడు. అన్నగా తమ్ముళ్లకి ఆనందాన్నిచ్చాడు. సమర్థ పాలకుడిగా ప్రజలకు ఆనందాన్నిచ్చాడు. అధికారాన్ని అనుభవిస్తూ రాజ్యాన్ని పాలిస్తూ సంసార జీవితాన్ని ఆస్వాదిస్తూ కూడా ఓ రుషిలా బతకొచ్చని రాముడు నిరూపించాడు. 'విద్ధిమాం రుషిభిః తుల్యం; కేవలం ధర్మ మాస్థితం -రుషిలానే నేనూ ధర్మాచరణకు కట్టుబడి ఉన్నా' అని ప్రకటించాడో సందర్భంలో, శ్రీరాముడు జగజ్జేత ఎందుకయ్యాడు? చేతిలోని కోదండం వల్లా, శక్తిమంతమైన రామబాణం వల్లా, అశ్వమేధ యాగాన్ని చేయడం వల్లా, వానరసేన వెన్నంటి ఉండటం వల్లా? అవేవీ కారణం కాదంటాడు వాల్మీకి మహర్షి. 'సత్యేన లోకాన్ జయతి - సత్యాన్ని నమ్మికోవడం వల్లే రాముడు ప్రపంచాన్ని జయించాడు' అని దశరథుడితో చెప్పించాడు..

హనుమంతుడు రాంబంటుగా మారింది కూడా, రాముడి బలాన్ని చూసో బలగాన్ని చూసో కాదు. 'గుణైః దాస్య ముపాగతః' -'నేను శ్రీరాముడి గుణాల్ని చూసే దాసుడిగా మారాను' అంటాడు మారుతి.

సత్యాన్ని నమ్ముకుంటే అదే ఆయుధమై కాపాడుతుంది. అదే అనంత అనుచర గణమై అండగా నిలుస్తుంది. అదే సోపానమై విజయాల వైపు నడిపిస్తుంది. జన్మకో సార్థకతనిస్తుంది. రాముడి జీవితమే అందుకు సాక్ష్యం. ఆ ధర్మ మూర్తినీ అతని ధర్మాచరణనూ గుర్తుచేసుకో డానికే ఏటా సీతారామ కల్యాణం చూచి తరించడమే..... ..... మహాభాగ్యం... పూర్వజన్మ సుకృత ఫలం.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

## అందరి ఆరాధ్య దైవం
# శ్రీ రామచంద్రుడే...!



సర్వజీవుల పట్ల దయామూర్తి
సకల ప్రాణుల శ్రేయస్సు కోరువాడు
ఘనచరిత్రగల ఘనుడు త్యాగధనుడు
దయ, జాలి, ప్రేమలకు నిలయం
దశరథ నందనుడు...

కోటిసూర్యుల తేజస్సు కలవాడు
ఎదుటివారిలో మంచినే చూసేవాడు
సమస్తలోకాల్లో సాటిలేని వీరుడు
సమస్యలను చిరునవ్వుతో స్వీకరించే
సుందరరూపుడు ఈ అందాలరాముడు...

ఆందోళనలేని స్థితప్రజ్ఞుడు
అసూయా, ఆవేశాలకు
అతీతుడు అయోధ్య రాముడు
దేవతలకే భయాన్ని కలిగించే
ధీశాలి,రాక్షసరాజు రావణాసురుని
సంహరించినవాడు క్రోధం, కామం
ఇంద్రియాలను జయించినవాడు...

రఘువంశ రాజకుమారుడు
క్రమశిక్షణకు ప్రతిరూపుడు
ధనుర్విద్యలో ఆరితేరినవాడు
ఒకే మాట ఒకే బాణం
ఒకే భార్యగల ఏకపత్నీ వ్రతుడు...

సకల గుణసంపన్నుడు
ప్రశాంత చిత్తం గలవాడు
సాహసికుడు సమర్థుడు
సత్యవాక్య
పరిపాలకుడు...

నిత్యం సత్యమే పలికే
వాడు
నీతిమంతుడు
దూరదృష్టి గలవాడు
దృఢసంకల్పస్వరూపుడు
ధర్మాత్ముడు
సత్యస్వరూపుడు...

సమస్త కార్యాలలో
సమర్థుడు




కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

అట్టి పురుషోత్తముడిని
మన పాలకులందరూ
ఆదర్శంగా తీసుకుంటే
వచ్చేది రామరాజ్యమే
కదా...

ప్రజాస్వామ్యంలో
ప్రజలంతా
సుఖశాంతులతో
జీవించరా..?
ధర్మం ధరణిపై
దద్దరిల్లదా...
ప్రగతి దేశమంతా
ప్రజ్వరిల్లదా..?
(అందరికీ
శ్రీరామనవమి
శుభాకాంక్షలు)

# సీతారాముల కల్యాణం ఒకే రోజు నాలుగు పెళ్లిళ్లు

విదేహ దేశానికి రాజు జనకుడు. ఆయన గొప్ప రాజు మాత్రమే కాక విలువలను గౌరవించే ఆదర్శ తండ్రి కూడా.
ఒకరోజు యజ్ఞం కోసం భూమిని దున్నుతుండగా బంగారు పెట్టెలో ఒక పసిపాప జనకునికి దొరికింది. ఆ పాపకు "సీత" అనే పేరు పెట్టి ప్రేమతో తన కూతురిలా పెంచుకున్నాడు.
కాలం గడిచేకొద్దీ సీత గుణవంతురాలిగా, వినయశీలిగా ఎదిగింది. తన కూతురికి గుణం,ధైర్యం, నిజాయితి గల జీవిత భాగస్వామిని కనుగొనాలనే ఆలోచనతో ఒక ప్రత్యేకమైన పరీక్షను ఏర్పాటు చేశాడు. శివుని మహా ధనస్సును ఎత్తి, దానికి తాడు కట్టగలిగినవాడే సీతను పెళ్ళి చేసుకోవాలని నిబంధన పెట్టాడు.
దేశం నలుమూలల నుండి రాజులు, వీరులు వచ్చారు. కానీ ఎవరూ ఆ ధనస్సును కదిలించలేకపోయారు.
ఆ సమయంలో విశ్వామిత్ర మహర్షి తో కలిసి అయోధ్య యువరాజులు రాముడు, లక్ష్మణుడు మిథిలకు చేరుకున్నారు. రాముడు వినయంగా అనుమతి తీసుకొని అందరూ చూస్తుండగా ధనస్సును సులభంగా ఎత్తి తాడు కట్టబోతుండగా అది విరిగడం చూసిన జనకుడు ఆనందభరితుడయ్యాడు. తన కూతురికి సరైన వరుడు దొరికాడని అతనికి నమ్మకం కలిగింది.
తర్వాత అయోధ్య రాజు దశరథుని ఆహ్వానించారు. రెండు రాజ కుటుంబాలు కలుసుకున్నాయి. ఆ సమయంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం
రామునితో సీతకు ,
లక్ష్మణునితో ఊర్మిళకు ,
భరతునితో మాండవికి ,
శత్రుఘ్నునితో శ్రుతకీర్తికి వివాహాలు ఒకే రోజు ఘనంగా జరిపించారు.
అది కేవలం వివాహ వేడుక కాదు; రెండు కుటుంబాల మధ్య ప్రేమ, గౌరవం, బంధం కలిసిన మహోత్సవం.
వివాహాల తర్వాత అందరూ ఆనందంగా అయోధ్యకు తిరిగి వెళ్తుండగా, పరశురాముడు అక్కడికి వచ్చి రాముని శక్తిని పరీక్షించాలని భావించాడు. దానికి రాముడు కోపంతో కాకుండా, శాంతంగా, వినయంగా స్పందించాడు. తన శక్తిని చూపినా, గర్వం చూపలేదు.
రాముడి ఆత్మస్థైర్యం, వినయం చూసి పరశు రాముడు సంతృప్తి చెందాడు.



అయోధ్యలోకి వచ్చిన తర్వాత సీతారాములు ఆదర్శ దంపతులుగా జీవించారు. వారు ఒకరినొకరు గౌరవించుకున్నారు. ఎక్కువ మాటలు అవసరం లేకుండానే వారి మధ్య అనుబంధం గాఢంగా మారింది. కుటుంబ బాధ్యతలను కలిసి నెరవేర్చారు.
ఈ కథ మనకు కుటుంబ విలువలను గుర్తుచేస్తుంది. తల్లిదండ్రుల ప్రేమ ఎంత గొప్పదో, జీవిత భాగస్వామి ఎంపికలో గుణాలకు ఎంత ప్రాధాన్యత ఉందో, కుటుంబాల మధ్య బంధం ఎంత పవిత్రమో తెలియజేస్తుంది. వినయం మరియు ధైర్యం కలిసినప్పుడు నిజమైన మహత్త్వం ఎలా కనిపిస్తుందో చూపిస్తుంది.
చివరగా ఈ కథ ఒక సత్యాన్ని చెబుతుంది: కుటుంబం అనేది కేవలం రక్త సంబంధం కాదు; ప్రేమ, గౌరవం, నమ్మకం కలిసిన బంధం..

రచన : తేరాల రాజేంద్రప్రసాద్ -
మీసేవ - బాబు జగ్జీవన్ రామ్ నగర్
(గిరినగర్), హైదరాబాద్ - 37
చరవాణి:9297109223





# మరో కొత్త దర్శకుడితో రామ్ పోతినేని?

కెరీర్ లో ఫ్లాప్స్ వచ్చినప్పటికీ రామ్ ఎప్పుడూ తగ్గలేదు. నచ్చిన దర్శకుడితో, నమ్మిన కథను పట్టాలపైకి తీసుకొచ్చాడు. అలా ఏడాదికొక సినిమా చేస్తూనే ఉన్నాడు. ఈసారి కూడా అదే పద్ధతి కొనసాగిస్తున్నాడు. ఫ్లాప్ వచ్చినా గ్యాప్ తీసుకోకుండా మరో దర్శకుడితో కలిసి సినిమా చేయబోతున్నాడు.
లోకేశ్ కనగరాజ్ వద్ద దర్శకత్వ విభాగంలో పనిచేసిన విఘ్నేష్ అనే వ్యక్తికి డైరక్షన్ ఛాన్స్ ఇవ్వబోతున్నాడు రామ్. ఇంతకుముందు లోకేశ్ కనగరాజ్ తో 3 సినిమాలకు ఇతడు వర్క్ చేశాడు. ఇతడు చెప్పిన కథ రామ్ కు నచ్చింది.
గడిచిన 4-5 నెలలుగా ఎన్నో కథలు విని, ఫైనల్ గా విఘ్నేశ్ కు ఛాన్స్ ఇచ్చాడంటే, కచ్చితంగా ఇది కొత్త రకం కథ అయి ఉంటుందనే అంచనాలు మొదలయ్యాయి. సినిమాను ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. గతేడాది ఆంధ్రా కింగ్ తాలూక సినిమా చేశాడు రామ్. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకున్నాడు. కేవలం నటించి ఊరుకోకుండా క్రియేటివ్ పార్ట్ కూడా చూసుకున్నాడు. ఓ పాట కూడా రాశాడు. అయితే సినిమాకు మంచి రివ్యూలు వచ్చినప్పటికీ, కమర్షియల్ గా సక్సెస్ కాలేకపోయింది. అంతకంటే ముందొచ్చిన డబుల్ ఇస్మార్ట్, స్కంద, ది వారియర్ సినిమాల గురించి ఎంత చెప్పుకుంటే అంత మంచిది. ఇలా వరుసగా ఫ్లాపులిస్తున్న ఈ హీరో, ఇప్పుడు లోకేశ్ కనగరాజ్ అసోసియేట్ ను నమ్ముకున్నాడు. ఈ ప్రాజెక్టు ఏ బ్యానర్ కు వెళ్తుందో చూడాలి.

# హీరోయిన్లకు ఏమాత్రం అచ్చిరాని స్టార్ హీరో

పవన్ కల్యాణ్ సినిమాలో హీరోయిన్ పాత్ర అనగానే చాలు ఎవరైనా ఎగిరి గంతేస్తారు. కథ కూడా వినకుండా ఓకే చెప్పిన హీరోయిన్లు కూడా ఉన్నారు. హీరోయిన్లకు పవన్ అంటే అదొక క్రేజ్. ఆయన సినిమాల్లో నటిస్తే, హిట్ గ్యారంటీ అనే నమ్మకం. ఆయన సరసన నటించిన తర్వాత వరుసగా అవకాశాలు క్యూ కడతాయనే ఆశ.
కానీ పవన్, హీరోయిన్లకు ఈమధ్య బొత్తిగా కలిసి రావడం లేదు. ఆయన నటించిన సినిమా హిట్ అవుతుందా, ఫ్లాప్ అవుతుందా అనే విషయాన్ని పక్కనపెడితే, అందులో నటించిన హీరోయిన్ మాత్రం క్లిక్ అవ్వడం లేదు.
ఉదాహరణకు ఉస్తాద్ భగత్ సింగ్ నే తీసుకుంటే, ఇందులో మెయిన్ హీరోయిన్ గా శ్రీలీల నటించింది. అప్పటికే వరుస ఫ్లాపులున్నాయి ఆమె ఖాతాలో. అయినప్పటికీ ఆమె చెక్కుచెదరలేదు. కారణం పవన్ కల్యాణ్. పవన్ తో చేసిన ఈ ఒక్క సినిమా తన అన్ని ఫ్లాపులకు చెక్ పెట్టేస్తుందని ఆశపడింది. కానీ ఆమె ఆశల్ని పవన్ కల్యాణ్ అడియాశలు చేశారు.
ఇదే సినిమాలో మరో హీరోయిన్ గా రాశి ఖన్నా నటించింది. పవన్ కల్యాణ్ సరసన నటిస్తే ఆటోమేటిగ్గా క్రేజ్ వస్తుందనే ఉద్దేశంతో, కథ కూడా వినకుండా సెట్స్ పైకి వచ్చేసింది. కట్ చేస్తే, ఉస్తాద్ ఈమెకు బొత్తిగా కలిసిరాలేదు. ఆల్రెడీ గతేడాది భారీ ఫ్లాప్ చూసిన రాశి ఖన్నాకు, ఉస్తాద్ దెబ్బతో తెలుగులో మరో అవకాశం వస్తుందా అనేది అనుమానాలు కలుగుతున్నాయి.



ఓజీ సినిమా హీరోయిన్ ది కూడా ఇదే పరిస్థితి. పవన్ కల్యాణ్ సినిమాతో తెలుగులో ఓ వెలుగు వెలిగేద్దాం అనుకుంది ప్రియాంక మోహన్. సమయం, సందర్భం లేకుండా ఓజీ గురించి మాట్లాడింది. మొత్తానికి ఓజీ థియేటర్లలోకి వచ్చింది. పవన్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ కమర్షియల్ హిట్ గా నిలిచింది. కానీ ప్రియాంక మోహన్ కు మాత్రం అవకాశాల్లేవు.
ప్రియాంక మోహన్, రాశిఖన్నా, శ్రీలీల పరిస్థితి కొంత బెటర్. నిధి అగర్వాల్ పరిస్థితి ఘోరాతి ఘోరం. పవన్ తో హరిహర వీరమల్లు సినిమా చేసింది ఈ కన్నడ బ్యూటీ. ఆ సినిమా కోసమే ఏళ్లుగా ఎదురుచూసింది. అడిగినప్పుడల్లా కాల్షీట్లు ఇచ్చింది. అగ్రిమెంట్ ప్రకారం, మరో సినిమా చేయకుండా పవన్ సినిమాకే అంకితమైంది. ఒక దశలో పవన్ కంటే ఎక్కువగా తనే ప్రచారం చేసింది.
హరిహర హిట్టయితే తెలుగులో స్టార్ హీరోయిన్ స్టేటస్ వస్తుందని కలలుకనింది. కానీ వీరమల్లు కరుణించలేదు. ఐదేళ్ల కిందట నిధి అగర్వాల్ పరిస్థితి ఎలా ఉందో, ఇప్పుడూ అంతే. అవకాశాల కోసం అవే ఎదురుచూపులు. ఇలా ఈమధ్య కాలంలో పవన్ సరసన నటించిన హీరోయిన్లు ఎవ్వరూ ఇండస్ట్రీలో క్లిక్ అవ్వలేకపోతున్నారు.

## తోటపాలేం ఎస్సీ కాలనీలో రోడ్ల నిర్మాణానికి

# నిధులు మంజూరు చేస్తాం

### నూతన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హనుమంతు కూర్మారావు



**నవతరం-ఎచ్చెర్ల**

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన తోటపాలేం గ్రామ ఎస్సీ కాలనీలో కమిషనర్ హనుమంతు కూర్మారావు పర్యటించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు బలగ మోహనరావు ఎస్సీ కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్లు, కాలువలను నూతనంగా నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కూర్మారావు మాట్లాడుతూ కమిషనర్ గా బాధితులు స్వీకరించిన అనంతరం మొట్ట మొదటిసారిగా తోటపాలేం గ్రామంలో పర్యటించామని ఈ సందర్భంగా గ్రామస్తులు నుండి త్రాగునీరు, రోడ్లు, కాలువల సమస్యలపై ఫిర్యాదులు అందుకున్న మన్నారు. అతి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎస్సీ కాలనీలో రోడ్లు కాలువల నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## మాతా, శిశు ఆరోగ్య సేవలు

# బలోపేతానికి మరింత చేయూత



**నవతరం-పార్వతీపురం**

- గర్భిణులు, నవజాత శిశువులకు అత్యవసర ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషించాలి
- గిరిజన, గ్రామీణ ప్రజలు సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి పిలుపు

జిల్లాలోని గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో మాతా, శిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద మాతా, శిశు మరణాల నివారణకు అందించిన వైద్య పరికరాలు, సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు హిందుస్థాన్ షిప్‌యార్డ్ అందించిన సహకారం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కొనియాడారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ స్పాన్సర్ చేసిన ఆధునిక వైద్య పరికరాలను కలెక్టర్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 15 రేడియంట్ వార్మర్లు, 15 హైడ్రాలిక్ లేబర్ రూమ్ టేబుల్స్ (బెడ్స్‌తో సహా) జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందజేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ పరికరాలు ప్రసవ సమయంలో గర్భిణులు, నవజాత శిశువులకు అత్యవసర ప్రాణ రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పీహెచ్‌సీ సిబ్బందికి ఈ కొత్త పరికరాల వినియోగంపై పూర్తి అవగాహన కల్పించి, గిరిజన ప్రజలకు వీటి సేవలు సద్వినియోగమయ్యేలా చూడాలని సూచించారు.

ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న హిందుస్థాన్ షిప్‌యార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, సెక్రటరీ ఐ.బేగ్, డిజిఎం వి.ప్రశాంత్ లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, వైద్యాధికారుల బృందం డా. కె.విజయపార్వతి, డా. వై.విజయమోహన్, డా. టి.జగన్ మోహనరావు, డా. ఎం.వినోద్ కుమార్, సూర్యకౌశిక్, ఎన్జీవో జిల్లా ప్రెసిడెంట్ జీవీఆర్కే.కిషోర్, కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారామ లక్ష్మణ హనుమాన్ సమేత

# ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

**నవతరం-గార**

అంపోలు గ్రామంలో గురువారం సీతారామ లక్ష్మణ హనుమాన్ సమేత ఉత్సవ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

బూర్జ గ్రామానికి చెందిన అంపోలు కేశవ శర్మ ఆధ్వర్యంలో, జగన్నాథ శాస్త్రి పర్యవేక్షణలో రుత్వికులు ఆరవెల్లి కృష్ణమూర్తి, వెంకటరమణమూర్తి, శ్యాంబాబు, గురునాధరావు వేద మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ ఆరాధన, మండల పూజలు, జలాదివాసం, క్షీరాదివాసం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం సీతారాములు కళ్యాణం కన్నుల పండుగగా



జరుగుతోందని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీకోదండ రామాలయం మాజీ చైర్మన్ చెట్టు నాగేశ్వరరావు దంపతులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో

# హెటిరో ఫార్మా వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

- చివరి సంవత్సరం విద్యార్థులు, నిరుద్యోగులు వినియోగించుకోవాలి
- ప్రిన్సిపాల్ యన్ వీ వేణుగోపాల్



**నవతరం-శ్రీకాకుళం**

స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డు లోగల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఫార్మ కంపెనీ హెటిరో డ్రగ్స్ వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారు. ఈనెల అనగా మార్చి 29వ తేదీ ఆదివారం హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ వారు తమ కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ యన్వీ. వేణుగోపాల్ , డైరెక్టర్ బిఎస్.చక్రవర్తి, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్సి కెమిస్ట్రీ , ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బిఫార్మా , ఎం.ఫార్మా ఐటిఐ , డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతోపాటుగా , నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరు కాగల తలచిన విద్యార్థులు ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డు లోగల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో హాజరు కాగలరని తెలిపారు. ఇంటర్వ్యూకి వచ్చే విద్యార్థులు తమ సర్టిఫికెట్లు, ఐడెంటిటీ కార్డు తీసుకుని రావలసిందిగా తెలియజేశారు.

# ఐఐఐటీ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

**నవతరం-ఎచ్చెర్ల**

క్యాంపస్‌లో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని ఐఐఐటీ శ్రీకాకుళం డైరెక్టర్ ప్రొఫెసర్ సంధ్ర అమరేంద్ర కుమార్ పేర్కొన్నారు. గురువారం శివాని ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో పియుసి విద్యార్థులకి, ఐఐఐటీ ప్రాంగణంలో ఐఐఐటీ విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, క్యాంపస్-2 ఇన్-ఛార్జ్ సాగర్, వెల్ఫేర్ డీన్లు సింహాచలం, యోగేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యా హక్కు చట్టం -2009, సెక్షన్ 12(1)సి ప్రకారం 2025-2026

# ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం

### ఎస్ఎస్ఎ ఎపిసి పి. వేణుగోపాలరావు

**నవతరం-శ్రీకాకుళం**


విద్యా హక్కు చట్టం -2009 సెక్షన్ 12(1)సి ప్రకారం 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పిల్లలు (అనాధలు, హెచ్ఐవి బాధితులు, విభిన్న ప్రతిభా వంతులు) ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనారిటీ, ఓసి వర్గాల పిల్లలకు రాష్ట్రంలోని వారి నివాస సమీప ప్రాంతంలో ఐ.బి/సి.బి.ఎస్.ఇ/ఐ.సిఎస్. ఇ/స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం అర్హులైన విద్యార్థులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయింపు జరిగినట్లు ఎస్ఎస్ఎ ఎపిసి పి. వేణుగోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపికైన విద్యార్థుల జాబితా వివరాలను సంబంధిత పాఠశాలలో చూడవచ్చని, ఇతర విషయాలకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి సంప్రదించవచ్చునన్నారు. సంబంధిత పాఠశాలలు వెబ్సైట్లో చూడవచ్చునని, ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 7వ తేదీన లోగా ఎంపికైన పాఠశాలల్లో జాయిన్ అవ్వవలసినదిగా పేర్కొన్నారు. ఇతర వివరములు కొరకు టోల్ ఫ్రీ నెంబర్ :18004258599, సంప్రదించాలని కోరారు.

# వర్శిటీలో రేపు ఆచార్య రోణంకి విగ్రహావిష్కరణ

**నవతరం-ఎచ్చెర్ల**

బహూభాషా కోవిధుడు, ఆదర్శనీయ అధ్యాపకుడు, అనువాదకుడు, జాతీయ ఉపన్యాసకులు ఆచార్య రోణంకి అప్పలస్వామి విగ్రహాన్ని శుక్రవారం డా. బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలో ఆవిష్కరించనున్నారు. శ్రీమతి చిగురుపల్లి చంద్రకళ స్మారక వేదిక (శ్రీకాకుళం) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ విగ్రహాన్ని వర్శిటీ వీసీ ఆచార్య కేఆర్. రజని ఆవిష్కరించనున్నారు. అనంతరం, ఆచార్య రోణంకి వర్ధంతి సభను కూడా నిర్వహించనున్నారు. ఈ వేదిక చైర్మన్ చిగురుపల్లి ప్రభాకరరావు అధ్యక్షత వహించే ఈ సభలో ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాదరావు (విజయనగరం), వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు, ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు ఎస్వీ.అనిల్ కుమార్, ఏపీ స్టడీ సర్కిల్ ఛీఫ్ కన్సల్టెంట్ ఉప్పాడ సుబ్రహ్మణ్యం, క్యులిజీల్ సీఈవో రోణంకి మధుమూర్తి, డ్వామా-విశాఖ డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి శిష్టు రవీంద్ర, ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి తదితరులు పాల్గొననున్నారు. ఆచార్య రోణంకి అభిమానులు, సాహితీ ప్రియులు, విద్యావేత్తలు, రచయితలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రకళ స్మారక వేదిక చైర్మన్ చిగురుపల్లి ప్రభాకరరావు కోరారు.



రోణంకి అప్పలస్వామి

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**